# సభకు సారొస్తుండ్రు..

**ఇల్లెందులో తొలిసారి జరగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ**

**సభను సక్సెస్ చేయాలి : మంత్రి సత్యవతి రాథోడ్**

**ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎన్నికల ఇన్‌చార్జి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే హరిప్రియ, ఎంపీ కవిత**


ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ కోసం ఏర్పాటు చేసిన సభా వేదిక

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో బుధవారం జరిగే ప్రజా ఆశీర్వాద సభకు గులాబీ దళపతి, ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకానున్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ భద్రాద్రి జిల్లాలో పాల్గొనే తొలిసభ కావడంతో విజయవంతం చేసేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌తోపాటు మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత ఏర్పాట్లను పరిశీలించారు. ఇల్లెందు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పది రోజులుగా సీఎం సభను విజయవంతం చేసేందుకు దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు సీఎం సభకు జనం భారీగా తరలిరావాలని కోరుతున్నారు.

**గులాబీమయమైన కార్మిక ప్రాంతం**

సీఎం కేసీఆర్ ఎన్నికల సభకు ఇల్లెందు కార్మిక ప్రాంతం గులాబీమయమైంది. సీఎం రాక కోసం టేకులపల్లి నుంచి ఇల్లెందు వరకు గులాబీ జెండాలతో స్వాగత బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఇల్లెందు సమీపంలోని 30 ఎకరాల స్థలంలో సభాస్థలితోపాటు హెలిపాడ్ ఏర్పాటు చేశారు. సభకు వాహనాలతో వచ్చే నాయకులు, ప్రజలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పక్కనే పార్కింగ్ స్థలాలను కేటాయించారు. సింగరేణి కార్మికులు, టీబీజీకేఎస్ నాయకులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు ఇల్లెందును గులాబీమయం చేశారు.

**సభను సక్సెస్ చేయాలి : మంత్రి సత్యవతి రాథోడ్**

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. మంగళవారం ఇల్లెందు సభా స్థలానికి చేరుకున్న ఆమె నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ నిర్వహించే తొలిసభ కావడంతో భారీగా జనసమీకరణ చేయాలని సూచించారు. ఆమె వెంట మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, మహబూబాబాద్ జడ్పీ చైర్మన్ బిందు, ఎమ్మెల్యే హరిప్రియ ఉన్నారు.

**సభకు తరలిరావాలి : ఎంపీ వద్దిరాజు**

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు భారీగా తరలిరావాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. మంగళవారం ఇల్లెందు సీఎం సభావేదిక వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించిన ఆయన ముఖ్య నాయకులు, కార్యకర్తలతోపాటు ఎమ్మెల్యేతో కలిసి సమీక్షించారు. ఇల్లెందు గడ్డ బీఆర్ఎస్ అడ్డా అని, ఎవరు ఎన్ని కుతంత్రాలు చేసినా ఇక్కడ ఎగిరేది గులాబీ జెండానే అని అన్నారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం పక్కా అని, సర్వేలన్నీ మనకే అనుకూలంగా ఉన్నాయని అన్నారు. దీనిని ఓర్వలేని నాయకులు పిచ్చికూతలు కూస్తున్నారని, వాటిని పట్టించుకోవద్దన్నారు. సభకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని తెలిపారు.

**చరిత్రలో నిలిచిపోయేలా సభ**

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్**

ఇల్లెందు, అక్టోబర్ 31 : ఇల్లెందులో బుధవారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందని, సీఎం కేసీఆర్‌కు భారీగా స్వాగతం పలికేందుకు ఇల్లెందు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాటాడుతూ నియోజకవర్గం నలుమూలల నుంచి సభకు ప్రజలు తరలిరానున్నారన్నారు. సుమారు లక్ష మంది సభకు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తాగునీరు, షామియానాలు, కుర్చీలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేశామన్నారు.

## కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే సంక్షేమం

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్


సభా వేదికపై మంత్రి సత్యవతి జన్మదిన వేడుకలు

ఇల్లెందు, అక్టోబర్ 31 : వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగుతాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మంగళవారం ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం సమీపంలో ప్రజా ఆశీర్వాద సభా ఏర్పాట్లను ఎమ్మెల్యే, ఎంపీలతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయడానికి నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 75 వేల మంది ప్రజలు తరలిరానున్నారని తెలిపారు. కాంగ్రెస్ పరిపాలనలో పింఛన్ రూ.200 ఇస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2,016 చొప్పున ఇస్తున్నదన్నారు. ఎన్నికలు అనేసరికి అనేక మంది మీ దగ్గరకు వస్తారని, మీకు మేలు చేసింది ఎవరో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. దుబ్బాక అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని కోరారు. ఎమ్మెల్యే హరిప్రియను మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి సత్యవతి రాథోడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని వేదిపై కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, బీఆర్ఎస్ నాయకులు సిలివేరు సత్యనారాయణ, మూల మధుకర్‌రెడ్డి, మెట్ల కృష్ణ, నవీన్, వారా రవి, కిరణ్, కటకం పద్మావతి, ఘాజీ, గిన్నారపు రాజేష్, సనా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం

డోర్నకల్, అక్టోబర్ 31: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి సీఐ ఉపేందర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. సీఐ మాట్లాడుతూ పటేల్ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న ఏక్తా దివస్‌గా పిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు సంతోశ్‌రావు, ఝూన్సీ, హెడ్ కానిస్టేబుల్ హరీశ్, కోటేశ్వరావు, కానిస్టేబుల్ పాషా, నాస్రీన్, దేవీ, హోంగార్డు వెంకట్రావ్ పాల్గొన్నారు.


డోర్నకల్‌లో పటేల్‌కు నివాళులు అర్పిస్తున్న సీఐ ఉపేందర్‌రావు

## విస్తృత పోలీసుల తనిఖీలు

పెద్దవంగర, అక్టోబర్ 31: ఎన్నికల నేపథ్యంలో ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీ చేపట్టారు. మండలంలోని వడ్డెకొత్తపల్లి, పెద్దవంగర, అవుతాపురం స్టేజీల వద్ద కేంద్ర బలగాల సహకారంతో పెద్ద ఎత్తున తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు నగదు, విలువైన వస్తువులను ఎన్నికల నిబంధనలు పాటిస్తూ తీసుకెళ్లాలని సూచించారు. ఆర్ఐ లష్కర్, పోలీసు సిబ్బంది సురేశ్, సంతోష్, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు. కాగా, రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్ స్థానికులతో కలిసి రన్నింగ్ చేపట్టి ప్రతిజ్ఞ చేశారు.


పెద్దవంగరలో స్థానికులతో కలిసి ఏక్తా ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్సై రాజు

## ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం

డోర్నకల్, అక్టోబర్ 31: ముల్కలపల్లిలో ఐదు లీటర్ల గుడుంబాను డోర్నకల్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్సై ఝూన్సీ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్యా విజయ గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు మంగళవారం తనిఖీ చేశారు. ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశారు.


పెద్దవంగర: డప్పుచప్పుళ్లతో ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు


పెద్దవంగర: అవుతాపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక గతే

- మోసపూరిత హామీలను నమ్మొద్దు
- పాలకుర్తి దేవస్థాన, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ

పెద్దవంగర, అక్టోబర్ 31: మండలంలోని అవుతాపురం, పడమటి తండా, రాజమాన్‌సింగ్ తండా జీపీల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈదురు ఐలయ్య, శ్రీరాం సంజయ్‌తోపాటు పాలకుర్తి దేవస్థాన, మండల అభివృద్ధి కమిటీ చైర్మెన్ వెనుకదాసుల రామచంద్రయ్యశర్మ మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక గతే పడుతుందన్నారు. ప్రజల మనిషిగా నిత్యం ప్రజలతో ఉండే మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జిలు గోపాల్‌రావు, సోమేశ్వర్‌రావు, మండల రైతుబంధు కన్వీనర్ సోమారెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్, రవీందర్‌నాయక్, మాజీ జడ్పీటీసీ కమలాకర్‌నాయక్, మాజీ మండల అధ్యక్షులు సోమనర్సింహరెడ్డి, సుధీర్‌కుమార్, సునీల్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, కృష్ణమూర్తి, సుధాకర్, రమాదేవి, రమేశ్, సత్తయ్య, బిక్షపతి, యూత్ నాయకులు హరీశ్‌యాదవ్, అనుదీప్ పాల్గొన్నారు.

## గున్నేపల్లి సబ్ సెంటర్‌ను సందర్శించిన జాతీయ బృందం

దంతాలపల్లి, అక్టోబర్ 31: మండలంలోని గున్నేపల్లిలో ఆరోగ్య సబ్ సెంటర్‌ను నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ టీమ్ మంగళవారం సందర్శించింది. ఆ టీమ్ సభ్యుడు, రాష్ట్ర నోడల్ పర్సన్ జేవీ శ్రీనివాస్‌రావు సబ్‌సెంటర్ పరిధిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిరోధక టీకాలు, టీబీ ప్రోగ్రాంకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీధర్, డాక్టర్లు జ్వలిత, మిరాజ్, చైతన్య, అనుష, సీహెచ్‌వో బాలాజీ, కృష్ణార్జునరావు పాల్గొన్నారు.


సబ్ సెంటర్ వద్ద నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ టీం సభ్యులు

## చిన్నగూడూరులో పోలీసుల కవాతు

చిన్నగూడూరు, అక్టోబర్ 31: మండల కేంద్రంతోపాటు గుండంరాజుపల్లిలో స్థానిక పోలీసులు కేంద్ర బలగాలతో మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మరిపెడ సీఐ ఎల్.రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ఎలాంటి ఘటనలు జరిగినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్సై సంతోష్‌కుమార్, పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు ఉన్నారు.


చిన్నగూడూరు మండల కేంద్రంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు